సాక్షి
తిరుపతి
గురువారం । 11 । జనవరి । 2024



భగీరథ యత్నం.. వసతులు లభ్యం

నగరి నియోజకవర్గంలో రైల్వేస్టేషన్ల అభివృద్ధికి మంత్రి ఆర్కే రోజా విశేషంగా కృషి చేశారు. ఇప్పటికీ చేస్తున్నారు. - 8లో



ప్రతిష్టాత్మకంగా సంక్రాంతి సంబరాలు

చంద్రగిరిలోని ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు తుడా చైర్మన్ తెలిపారు. - 8లో



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అధికారులు స్వాగతం పలికారు. - 8లో

న్యూస్‌రీల్

వైభవంగా అధ్యయనోత్సవాలు ప్రారంభం



ఉభయదేవేరీ సమేతంగా స్వామివారు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో బుధవారం వైభవంగా అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ మేరకు ఆలయంలోని కల్యాణమండపంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారిని, సేనాధిపతిని, ఆళ్వార్లను వేంచేపు చేశారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు దివ్యప్రబంధ పారాయణం నిర్వహించారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా ఈనెల 20న చిన్న శాత్తుమొర, 26న ప్రణయ కలహోత్సవం, 30వ తేదీన పెద్ద శాత్తుమొర జరిపించనున్నట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రాధాకృష్ణ, ధనుంజయ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న డీఐజీ వెంకటేశ్వర్లు

వెంకటగిరిరూరల్ : క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందని కర్నూలు రేంజ్–3 డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండలంలోని వల్లివేడు గ్రామం వద్ద 9వ బెటాలియన్‌లో నిర్వహించిన వార్షికోత్సవ క్రీడా పోటీల్లో ఆయన మాట్లాడారు. క్రీడలతో యువత ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. స్పోర్ట్స్ కోటాలో క్రీడాకారులు ఉద్యోగాలు సైతం పొందవచ్చని సూచించారు. అనంతరం క్రీడల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు, ట్రోఫీ పంపిణీ చేశారు.


శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 65,901 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 16,991 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.77 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమతోంది. టికెట్లు లేని వారికి 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ఎస్వీయూలో రాష్ట్రస్థాయి హాకీ పోటీలు


తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ మైదానంలో బుధవారం రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ హాకీ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మొత్తం 18 జిల్లాల నుంచి జట్లు పాల్గొంటున్నాయి. తొలిరోజు పోటీల్లో అనంతపురం జట్టుపై 2–0తేడాతో విజయనగరం జట్టు, పొట్టిశ్రీరాములు నెల్లూరు జట్టుపై 1–0 తేడాతో ప్రకాశంజట్టు, కృష్ణా జట్టుపై 7–0తేడాతో అన్నమయ్య జట్టు, ఎన్‌టీఆర్ జిల్లా జట్టుపై 2–0తేడాతో శ్రీకాకుళం జట్టు, అనంతపురం జట్టుపై 5–0తేడాతో కర్నూలు జట్టు, నెల్లూరు జట్టుపై 6–0తేడాతో ఏలూరు జిల్లా జట్టు విజయం సాధించాయి. అలాగే కాకినాడ– ఏలూరు, గుంటూరు–పశ్చిమ గోదావరి జట్ల మధ్య పోటీలు డ్రాగా ముగిసినట్లు జిల్లా హాకీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.స్ఫూర్జన్‌రాజ్, బి.ఆదిత్య తెలిపారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.55 కోట్లు



కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న చైర్మన్, ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానికి హుండీ కానుకల ద్వారా రూ.1,55,21,259 ఆదాయం లభించింది. బుధవారం ఆలయంలోని శ్రీగురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద హుండీ కానుకలను లెక్కించారు. 28 రోజులకు సంబంధించి ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల కానుకల ద్వారా రూ.1,55,21,259 నగదుతో పాటు బంగారు 43 గ్రాములు, వెండి 415.440 కిలోలు లభించినట్లు దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో కేఎస్ రామారావు వెల్లడించారు.



సేద్యం.. సాయం



వాకాడు మండలం కల్లూరులోని రైతు భరోసా కేంద్రం



ఆర్బీకేలో రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, అధికారులు (ఫైల్)

"అన్నదాత ఆనందంగా ఉండాలి.. పెట్టుబడికి ఇబ్బంది లేకుండా సాగు చేపట్టాలి.. సంబరంగా సేద్యం చేసుకోవాలి.. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి.. తద్వారా వ్యవసాయం పండుగలా మారాలి" ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నారు. రైతాంగానికి వెన్నుదన్నుగా నిలిచేందుకు రైతు భరోసా పథకం ప్రవేశపెట్టారు. పారదర్శకంగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నారు. ఈ క్రమంలోనే క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన ఆర్బీకేల ద్వారా కర్షకుడికి చేయూతనందిస్తున్నారు. చిత్తశుద్ధితో సేవలందిస్తున్న ప్రభుత్వంపై రైతులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

- వ్యవసాయానికి వెన్నుదన్నుగా ప్రభుత్వం
- రైతు భరోసా పథకం కింద పెట్టుబడికి చేయూత
- పంటల సాగుకు పకడ్బందీగా నగదు పంపిణీ
- సకాలంలో అన్నదాతల బ్యాంకు ఖాతాలో జమ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం

చిల్లకూరు : గత టీడీపీ హయాంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా రైతులు నానా అవస్థలు పడ్డారు. పంటకు గిట్టుబాటు ధర లేక నష్టాల బారిన పడ్డారు. ప్రకృతి ప్రకోపానికి గురై పంటలు దెబ్బతిన్నా పట్టించుకునేవారు అప్పుల పాలయ్యారు. పెట్టుబడి సంగతి దేవుడెరుగు పరిహారం కూడా అందక ఆత్మహత్యలే శరణ్యమనుకునే పరిస్థితుల్లో కొట్టుమిట్టాడారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నదాతల సంక్షేమమే పరమావధిగా చర్యలు చేపట్టింది. రైతులు అప్పుల ఊబిలో చిక్కుకోకుండా రైతు భరోసా పథకం ప్రవేశపెట్టింది. ప్రధాన మంత్రి కిసాన్ యోజనతో కలిసి ఏటా రూ.13,500లను పెట్టుబడి సాయం కింద అందజేస్తోంది. ఈ క్రాప్ నమోదు చేసుకున్న ప్రతి రైతుకూ నగదు పంపిణీ చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోతే వెంటనే పరిహారం అందిస్తోంది.

అందుబాటులో ఆర్బీకేలు

వ్యవసాయానికి సహకారం అందించేందుకు ప్రభుత్వం ప్రతి సచివాలయ పరిధిలో ఒక్కో రైతు భరోసా కేంద్రం చొప్పున ఏర్పాటు చేసింది. భూసార పరీక్షల నుంచి ఈ క్రాప్ నమోదు వరకు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చేయిస్తోంది. రైతులకు అవసరమైన పురుగు మందులు, విత్తనాలు, ఎరువులను ఇంటి ముంగిటకే చేరుస్తోంది. వ్యవసాయ పరికరాలను సైతం రాయితీపై పంపిణీ చేస్తోంది. అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా పంటల సాగుకు అవసరమైన సలహాలు అందిస్తోంది. దిగుబడి అయిన ఉత్పత్తులను గిట్టుబాటు ధరకే కొనుగోలు చేస్తోంది. ఈ మేరకు వ్యవసాయాన్ని పండుగలా మార్చేసింది.

రైతుల కష్టాలు తీర్చారు



పంట దిగుబడిలో కీలకమైన ఎరువులను ఖరీఫ్,రబీ సీజన్ల ప్రారంభానికి ముందే ప్రభుత్వం ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచింది.రైతులకు అవసరమైన ఎరువులు,పురుగుమందులను ఆర్బీకేల ద్వారా అందిస్తుంది.అధికార యంత్రాంగాన్ని రైతుల వద్దకు పంపి అండగా ఉండేలా చూస్తుంది.ప్రతి ఏడాది క్రమం తప్పక నగదు బ్యాంకు ఖాతా ద్వారా అందుతుంది. దీంతో అప్పుల బాధలు తప్పుతున్నాయి.

– రాజారెడ్డి, అగ్రహారం, కోట మండలం

అడుగడుగునా ప్రోత్సాహం



రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవసాయరంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. అనుబంధ రంగాలను సైతం అడుగడుగునా ప్రోత్సహిస్తోంది. అన్నదాతల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. నాకు ఇప్పటి వరకు రైతు భరోసా పథకం కింద రూ.67,500 అందించారు.

– సుంకర మస్తానయ్య, రైతు, ఊనుగుంటపాళెం, కోట మండలం

ముందస్తుగా ఖాతాలో..



గత టీడీపీ ప్రభుత్వం రైతులకు మొండి చేయి చూపించింది. రుణమాఫీ పేరుతో నిలువునా మోసం చేసింది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి మనసుతో రైతులకు సాయం చేస్తున్నారు. రైతు భరోసా కింద క్రమం తప్పకుండా నగదు అందిస్తున్నారు. పెట్టుబడికి ఇబ్బంది పడాల్సిన అవసరం లేకుండా ముందస్తుగానే మా ఖాతాలో డబ్బు జమ చేస్తున్నారు.

– సైదాపల్లె శంకరయ్య, రైతు, పురిటిపాళెం, గూడూరు మండలం

కష్టాలు తప్పించారు



వ్యవసాయమే మాకు జీవనాధారం. గతంలో పంట సాగుకు పెట్టుబడికి తీవ్రంగా ఇబ్బంది పడేవాళ్లం. అప్పులు చేసి వడ్డీలు కట్టలేక దిక్కుతోచని స్థితిలో ఉండేవాళ్లం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని సకాలంలో రైతు భరోసా పథకం కింద నగదు అందుతోంది. వెతుక్కోవాల్సిన అవసరం లేకుండా పెట్టుబడికి డబ్బు వస్తోంది. మొత్తంమీద మా కష్టాలు తప్పించారు. అదే ఆనందం.

– కందల కొండయ్య, రైతు, ఏరూరు, చిల్లకూరు మండలం

గట్టెక్కిస్తున్నారు



పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతు భరోసా పథకం ప్రవేశపెట్టింది. ఏటా రూ.13,500 మా ఖాతాలో జమ చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వ్యవసాయం పండుగలా మారింది. అప్పులు చేసే పరిస్థితి నుంచి మమ్మల్ని గట్టెక్కిస్తున్నారు. ఆయనకే రైతులందరూ అండగా నిలవాలి.

– ముత్యాలయ్య, రైతు, కొత్తపాళెం, కోట మండలం



చిల్లకూరు మండలంలో ఈ- క్రాప్ నమోదు చేస్తున్న ఆర్బీకే సిబ్బంది (ఫైల్)

క్రమం తప్పకుండా..



రైతు భరోసా కింద క్రమం తప్పకుండా నగదు అందిస్తుండడం గొప్ప విషయం. ఏటా పంట నమోదు పూర్తయిన వెంటనే వ్యవసాయాధికారులు పంపిన జాబితా ప్రకారం మా ఖాతాలో డబ్బులు వేసేస్తున్నారు. ముఖ్యంగా మాలాంటి కౌలు రైతులను కూడా ఏమాత్రం విస్మరించకుండా సాయం అందించడం విశేషం. నాకు నాలుగేళ్లుగా సకాలంలోనే నగదు అందింది.

– కోమిటి పుట్టయ్య, కౌలు రైతు, పడమర గూడూరు

పంటకు ముందే..



గత టీడీపీ హయాంలో వ్యవసాయమే దండగన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెట్టుబడి కింద పంటకు ముందే నగదు అందిస్తున్నారు. రైతు భరోసా పథకం ఎంతో ఉపయోగకరం. సీజన్‌కు ముందే చేతికి డబ్బు రావడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగు మొదలు పెట్టుకుంటున్నాం. అలాగే వ్యవసాయశాఖ సిబ్బంది తరచూ మా పొలాల వద్దకు వచ్చిన అవసరమైన సలహాలు అందిస్తున్నారు. జగనన్న పాలన చాలా బావుంది.

– జానా సోమశేఖర్, రైతు, కాకువారిపాళెం, చిల్లకూరు మండలం

ఆదుకుంటోంది



వ్యవసాయం చేసే చిన్న, సన్న కారు రైతులకు ప్రభుత్వం అందించే పెట్టుబడి నిధి ఆదుకుంటోంది. దీంతో మాకు అప్పులు చేయాల్సిన తిప్పలు తప్పుతున్నాయి. సాగు మీద దృష్టి పెట్టి మంచి దిగుబడి సాధించే వెసులుబాటు వచ్చింది. అలాగే ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సహకారం అంతా ఇంతా కాదు. ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా వ్యవసాయానికి కావాల్సినవన్నీ మా ఊర్లోని ఆర్బీకేల్లోనే దొరుకుతున్నాయి.

– నెల్లిబోయిన కృష్ణయ్య, రైతు, మేగనూరు, గూడూరు మండలం

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు



భారీ ర్యాలీతో మోహిత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

- అభివృద్ధికి మద్దతు తెలిపి జై కొడుతున్న టీడీపీ శ్రేణులు
- భారీ ర్యాలీతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ఘన స్వాగతం
- 35 కుటుంబాలు స్వచ్ఛందంగా పార్టీలో చేరిక
- కండువాలు కప్పి ఆహ్వానించిన తుడా చైర్మన్

పాకాల: మండలంలోని మేజర్ పంచాయతీ దామలచెరువులో టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం తుడా చైర్మెన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. ముందుగా దామలచెరువు నుంచి మొబ్బినాయనపల్లె వరకు ఆటో ర్యాలీ నిర్వహించి మేళ తాళాలు, మంగళవాయిద్యాలు, భారీ బాణాసంచా పేలుళ్ల సందడి నడుమ మోహిత్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ నాయకుడు సంతోషం ఆధ్వర్యంలో దాదాపు 35 మంది నాయకులు తమ కుటుంబసభ్యులు, బంధువులతో కలసి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ బలోపేతానికి, మోహిత్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీతో సాధ్యమని పార్టీని మరింతగా ప్రజల్లోకి తీసుకెళతామని పేర్కొన్నారు.

పార్టీ అండగా ఉంటుంది

మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులు స్వచ్ఛందంగా పండుగ వాతావరణంలో వైఎస్సార్ సీపీలో చేరడం చాలా సంతోషంగా ఉందని, తమపై నమ్మకంతో పార్టీలో చేరిన వారందరికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఏ సమస్య వచ్చినా తీర్చేందుకు తాను, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెంటే ఉంటామని భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ జయదేవ్‌నాయుడు, పార్టీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, ఎంపీపీ లోకనాథం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో దామలచెరువు పంచాయతీ మొబ్బినాయనపల్లెకు చెందిన సంతోష్, దాము, వినోద్, మదన, ధనంజయ, నరసింహులు, పేరసానిపల్లె పంచాయతీ తురకపల్లెకు చెందిన బాషాఖాన్, అన్వర్, జహీర్‌ఖాన్, సాబ్జాన్, ఎస్.లాలూ, రఫీ, నజీర్, అబ్దుల్‌ఖాదర్, మన్సూర్, అరగొండ బాషా, శాబాన్, ఇస్మాయిల్, ఆటో రఫీ, నూర్, మహ్మద్‌బాషా, రషీద్, మాబాషా, బాబు, కుమ్మరపల్లెకు చెందిన నరసింహులు, హరికృష్ణ, హరీష్, పదిపుట్లబైలు పంచాయతీ పెరుగమాళ్లగుడిపల్లెకు చెందిన మనోహర్, నాగరాజు, తిరుమలయ్య, ఆజాద్ నగర్‌కు చెందిన యాసానుల్లా, పీరూసాహెబ్, రమీజాబీ, తస్లీమ్, మంగినాయనపల్లెకు చెందిన చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రఘుపతి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సురేష్, నేతలు కపిలేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, రహీం, ఖాజామస్తాన్, పవన్‌కుమార్, వినాయక, రమేష్, చంటి, ఇమ్రాన్, అల్తాఫ్, నరహరిరెడ్డి, ధనంజయరెడ్డి, నరేష్, మనోహర్‌రెడ్డి, చరణ్, గౌస్‌బాషా, మహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పట్టు కోల్పోయిన టీడీపీ

చంద్రగిరి నియోజకవర్గంలో ఒకప్పుడు టీడీపీకి కొంత పట్టున్న ఏకైక మండలం పాకాల. ఈ మండలం నుంచి ప్రస్తుతం భారీగా వైఎస్సార్ సీపీలోకి వలసలు పెరుగుతున్నాయి. చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో స్వచ్ఛందంగా చేరుతున్నారు. పార్టీలో చేరడం తమకు చాలా సంతోషంగా ఉందని స్పష్టం చేస్తున్నారు. కుల, మత, పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు, అర్హతే ప్రామాణికంగా పథకాలను అందజేయడం సీఎం జగనన్నకే సాధ్యమని నమ్మి పార్టీలో చేరుతున్నామని పేర్కొంటున్నారు. మోహిత్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకునేలా కష్టపడతామని హామీ ఇస్తున్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన

- కలెక్టరేట్ అధికారులతో డీఆర్‌ఓ పెంచలకిషోర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ పెంచలకిషోర్

తిరుపతి అర్బన్: ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు, ఉద్యోగులు అవగాహన పెంపొందించుకోవాలని డీఆర్‌ఓ పెంచల కిషోర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం వినియోగం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈవీఎం, వీవీప్యాట్‌లపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉంటేనే నిర్వహణ సజావుగా ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. పోలింగ్ నిర్వహణలో చేపట్టాల్సిన వివిధ ఏర్పాట్లపై ఎన్నికల కమిషన్ నిబంధనలపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, నియోజకవర్గస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మార్గనిర్దేశకుడు బీఆర్ అంబేడ్కర్



కలెక్టరేట్‌లో అంబేడ్కర్ ఫొటోలను పరిశీలిస్తున్న జేసీ శుభం భన్సల్, డీఆర్వో పెంచల కిషోర్

- కలెక్టరేట్‌లో ఛాయా చిత్రాలు ఏర్పాటు
- పరిశీలించిన జేసీ శుభం భన్సల్

తిరుపతి అర్బన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరికీ మార్గనిర్దేశకుడని జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ ఛాయా చిత్రాలను డీఆర్వో పెంచల కిషోర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో రూ.400 కోట్లతో 20 ఎకరాలలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సామాజిక న్యాయానికి స్ఫూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభోత్సవం చేయనున్నారని వెల్లడించారు. సామాజిక సమతా సంకల్ప (జన భాగీదారీ) కార్యక్రమాలను జిల్లాలో ఈ నెల జనవరి 4వ తేదీ నుంచి 19 వరకు వివిధ కార్యక్రమాల చేపడుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగా జిల్లా ప్రధాన కేంద్రమైన కలెక్టరేట్‌లో అంబేడ్కర్ స్ఫూర్తిదాయక ఛాయా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశామని, ఇది ఈ నెల 19 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలో సామాజిక సమతా సంకల్ప కార్యక్రమాలను అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతంగా పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ జయరాములు, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజా రఘువీర్, జిల్లా పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య, డివిజన్ అధికారి ఈశ్వరమ్మ, ఆడియో విజువల్ సూపర్‌వైజర్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


స్వర్ణ పతకం సాధించిన విద్యార్థిని

రేణిగుంట : చిత్తూరు ఇంటర్నేషనల్ గోజు–రై కరాటే పోటీల్లో సత్తా చాటిన రేణిగుంట ఇన్‌ఫాంట్ జీసెస్ స్కూల్ విద్యార్థులను ప్రిన్సిపల్ గురుశ్రీ సైమన్, హెచ్ఎం ఆల్ఫ్రెడ్‌ప్రేమ్ చంద్ బుధవారం అభినందించారు. వారు మాట్లాడుతూ కరాటే పోటీల్లో తమ విద్యార్థులు 10 బంగారు, 9 రజతం, 37 కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు.

ఎన్‌పీఎస్ రద్దుకు డిమాండ్


దీక్షలో రైల్వే ఉద్యోగులు

పాకాల : కేంద్రప్రభుత్వం వెంటనే ఎన్‌పీఎస్ (న్యూ పెన్షన్ స్కీమ్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం పాకాల రైల్వే జంక్షన్‌లో బ్రాంచ్ కార్యదర్శి పీఎం శివకుమార్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. శివకుమార్ మాట్లాడుతూ 2004 జనవరి 1వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన వారికి కొత్త పెన్షన్ విధానం అమలు చేస్తున్నారన్నారు. ఎన్‌పీఎస్‌ను రద్దు చేసేవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉదయ్‌శంకర్, తులసీరామ్‌రెడ్డి, చైతన్యకుమార్, హేమంత్‌కుమార్, వెంకటేష్, దయానంద్ పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

శ్రీ చిట్టా నాగమారుతి తండ్రి శ్రీ సి.శ్రీరామచంద్రమూర్తి పేరున గల నెం.2429/2023 తేది : 23.04.2003గల ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినవి. డాక్యుమెంట్ల వివరాల దిగువ తెలిపిన విధంగా ఉన్నాయి.

దాక్యుమెంట్ నం.2429/2023 తేది : 23.01.2023 సర్వే నెం. 489/1, వార్డు నెం.18-3, ఫ్లాట్ నెం.201, నిత్య ప్రసాదం అపార్ట్‌మెంట్స్, శాంతి నగర్, తిరుపతి.

సరిహద్దులు: ఉత్తరం : 10 అ.ల రోడ్డు, దక్షిణం: జగన్నాథ చర్చి, తూర్పు ఫ్లాట్ నం.489/2, పశ్చిమం: వి.శమంతకమణి ఫ్లాట్.

పైన తెలిపిన వివరాల ప్రకారం ఒరిజినల్ టైటిల్ డీడ్స్‌ను ఎవరైనా కనుగొంటే వాటిని **చీఫ్ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మున్సిపల్ రోడ్ బ్రాంచ్, తిరుపతి** వారికి అందజేయవలెను.

భగీరథ యత్నం.. వసతులు లభ్యం

తమిళనాడు సరిహద్దు పట్టణం నగరి. ఇక్కడి నుంచి నిత్యం చెన్నైకు రాకపోకలు సాగించే జనం.. అయినా ఇక్కడి రైల్వేస్టేషన్లలో వసతుల లేమి.. ఈ విషయం గుర్తించిన మంత్రి రోజా స్టేషన్ల అభివృద్ధికి అలుపెరగని పోరాటం.. భగీరథయత్నం చేశారు. ఫలితంగా అక్కడి రైలు నిలయాలకు వసతుల లభించాయి.

- రైల్వేస్టేషన్ల అభివృద్ధికి మంత్రి రోజా అలుపెరగని పోరాటం
- నగరి నియోజకవర్గంలోని స్టేషన్లలో సమకూరిన వసతులు


రైల్వే జీఎం వశిష్ట జోలేకు వినతిపత్రం అందిస్తున్న మంత్రి ఆర్కేరోజా (ఫైల్)

నగరి : నియోజకవర్గంలో రైల్వేస్టేషన్ల అభివృద్ధికి మంత్రి రోజా అలుపెరగని పోరాటం చేశారు. ఇప్పటికీ చేస్తూనే ఉన్నారు. ఫలితంగా రైల్వేస్టేషన్లలో వసతులు సమకూరుతున్నాయి. నగరి మున్సిపాలిటీ పరిధిలోని ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్‌లో రూ.5 కోట్ల వ్యయంతో అండర్‌బ్రిడ్జి నిర్మించారు. అలాగే సుమారు రూ.1.05 కోట్ల వ్యయంతో ఫుట్ ఓవర్ పాత్, రూ. 75 లక్షల వ్యయంతో ప్లాట్ ఫామ్, ప్రయాణికులు కూర్చునేందుకు సిమెంటు కుర్చీలు ఏర్పాటు చేశారు. అలాగే రూ.25 లక్షల వ్యయంతో ఎల్ఈడీ లైట్ల అమరిక, రూ. 20 లక్షల వ్యయంతో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, రూ. 20 లక్షల వ్యయంతో పే అండ్ యూజ్ టాయిలెట్స్, రూ.15 లక్షల వ్యయంతో సర్క్యులేటింగ్ ఏరియా డెవలప్‌మెంట్, రూ. 15 లక్షల వ్యయంతో వెయిటింగ్ హాల్ తదితర వసతులు సమకూరాయి. నాలుగో ప్లాట్ ఫామ్ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఏకాంబరకుప్పం గేటు ఆనుకుని డంపింగ్ యార్డులా చెత్తకుప్పలున్న ప్రాంతాన్ని శుభ్రపరచి, మళ్లీ అక్కడ చెత్త డంపింగ్ చేయకుండా చర్యలు చేపట్టారు. ఉదయం 10 నుంచి 2 వరకు మాత్రమే ఉన్న రిజర్వేషన్ సమయాన్ని 8 నుంచి 2 గంటల వరకు పెంచి, అడిషనల్ కౌంటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. పుత్తూరు రైల్వేస్టేషన్‌లో ప్లాట్ ఫామ్ నిర్మించారు. సీట్ల రిజర్వేషన్ సంఖ్యను పెంచారు. కోవిడ్ కారణంగా ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ లేకుండా చేసిన గరుడాద్రి, కాచిగూడ 17652 ట్రైన్లను మళ్లీ రైల్వే అధికారులతో చర్చించి స్టాపింగ్ ఏర్పాటు చేయించారు. తిరుత్తణి వరకే పరిమితమై ఉన్న చెన్నై తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను మళ్లీ తిరుపతి వరకు నడిచేలా చేసి నియోజకవర్గ ప్రజలకు ప్రయాణ సౌకర్యం కల్పించారు.

ఓర్వలేక అక్కసు ప్రదర్శిస్తున్న ప్రతిపక్ష పార్టీలు

2015 నుంచి గత ఏడాది వరకు క్రమం తప్పకుండా మంత్రి ఆర్కేరోజా రైల్వే సమస్యలపై పోరాడుతూనే ఉన్నారని, కొన్ని పనులను ఆమె తన చారిటబుల్ ట్రస్టు ద్వారా చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నేతలు తెలిపారు. ఇలా సమస్యను పరిష్కరించే నేపథ్యంలోనే ఆమె స్వయంగా ఏకాంబరకుప్పం రైల్వే అండర్ బ్రిడ్జిని శుభ్రం చేశారని, అయితే ప్రతిపక్ష పార్టీలు ఇప్పుడేదో ఎన్నికల నిమిత్తం పనులు చేస్తున్నట్లు ప్రకటించడం వారి ఓర్వలేని తనానికి అద్దం పడుతోందని వారు పేర్కొన్నారు. మంచి పనులు చేసేవారిని ప్రోత్సహించకపోగా, అక్కసును ప్రదర్శించడం, పనులను తప్పుబట్టడం ప్రతిపక్ష పార్టీల నీచరాజకీయాలకు నిదర్శనమన్నారు. ఎన్నికల నిమిత్తం చేసే పనులు కావని ఎనిమిదేళ్లుగా ఆమె పోరాడుతూనే ఉన్నారని, అభివృద్ధి పనులు చేయించుకుంటూ వస్తున్నారని, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు.


ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్‌లో నిర్మించిన ఫుట్‌ఓవర్‌పాత్

మంత్రి పోరాటం ఇలా..

- 2015, మే 25వ తేదీన నియోజకవర్గంలోని రైల్వేస్టేషన్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి చెన్నైకు వెళ్లి, సదరన్ రైల్వే జీఎం సురేష్‌కుమార్ శర్మకు వినతిపత్రం సమర్పించారు.
- 2016, జనవరి 28వ తేదీన ఏకాంబరకుప్పం, పుత్తూరు రైల్వేగేట్ల వద్ద ట్రాఫిక్ ఎక్కువగా ఉందని ఉమ్మడి తనిఖీ చేసి, అండర్ బ్రిడ్జిలను నిర్మించాలని చెన్నై, సదరన్ రైల్వే జీఎం వశిష్ట జోలేకు వినతిపత్రం అందజేశారు.
- 2020 ఫిబ్రవరిలో అప్పటి కేంద్ర రైల్వేమంత్రి పియూష్‌గోయల్‌ను కలసి రైల్వేస్టేషన్‌కు వసతులు కావాలని వినతిపత్రం ఇచ్చారు.
- 2021 డిసెంబర్ 26వ తేదీన గరుడాద్రి రైలులో జనరల్ కోచ్ ఏర్పాటు చేయాలని, స్థానికంగా ఉన్న విద్యార్థులు, వ్యాపారులు ఈ రైలుపైనే ఆధారపడి ఉన్నారని చెన్నై డివిజన్ రైల్వే డివిజనల్ మేనేజర్‌కు లేఖ పంపారు.
- 2023 ఫిబ్రవరి 14వ తేదీన మంత్రి తరపు ప్రతినిధి డీఆర్ఎం గణేష్‌కు ఏకాంబరకుప్పం, పుత్తూరు స్టేషన్లలో ఫ్లైఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని, చెన్నై ముంబై ఎక్స్‌ప్రెస్‌ను, యూనిట్ ట్రైన్లను పుత్తూరు వరకు పొడిగించాలని వినతిపత్రం అందజేశారు.

ప్రతిష్టాత్మకంగా సంక్రాంతి సంబరాలు

- ఎల్లమ్మ ఆలయంలో 14 నుంచి 18 వరకు నిర్వహణ
- పకడ్బందీ ఏర్పాట్లు చేయండి
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


ఆలయ కమిటీ, అధికారులతో సమీక్షిస్తున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

చంద్రగిరి : స్థానిక మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో ప్రతిష్టాత్మకంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో పాలక మండలి చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ తిమ్మారెడ్డితో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. మోహిత్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు కోరారు. మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణలకు సిబ్బంది పనిచేయాలన్నారు. అలాగే భక్తులకు నిర్విరామంగా ప్రసాదాలు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. సమన్వయంతో పనిచేసి సంక్రాంతి వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆలయ అవరణలో చేపట్టిన నూతన నిర్మాణాలను పరిశీలించారు. ఆలయ అధికారులు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా అమ్మవారు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వివిధ అలంకరణలో భక్తులను కటాక్షించనున్నట్లు తెలిపారు. టీటీడీ నుంచి అమ్మవారికి ప్రత్యేక సారె సమర్పించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలాజీ నాయక్, ఎస్ఐ హిమబిందు, సెక్రటరీ మహేశ్వరయ్య పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


ఆలయం వెలుపల అనిల్‌కుమార్

తిరుమల : తిరుమల శ్రీవారిని బుధవారం ఏపీ అసెంబ్లీ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే ఏవీ ప్రసాద్ సేవించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

ఆకతాయి వేధింపులకు విద్యార్థిని ఆత్మహత్య


విద్యార్థిని మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు


మృతురాలి బంధువులతో మాట్లాడుతున్న డీఎస్పీ కోటారెడ్డి

సైదాపురం : ఆకతాయి వేధింపులు తాళలేక ఓ విద్యార్థిని బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. సైదాపురానికి చెందిన బండి శిరీష(16) గూడూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. అదే గ్రామానికి చెందిన కోలా జస్వంత్ (20) అనే ఉ యువకుడు రోజూ వేధిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో విద్యార్థిని తమ కుటుంబసభ్యులకు విషయం తెలిపింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు తమకు న్యాయం చేయడంలేదని భావించిన విద్యార్థిని హుటాహుటిన ఇంటికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. కుటుంబీకులు వెంటనే గూడూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే శిరీష మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతురాలి బంధువులు, కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. పోలీస్‌స్టేషన్ ఎదుట మృతదేహాన్ని ఉంచి తమ బిడ్డ మరణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న డీఎస్పీ కోటారెడ్డి, సీఐ సుబ్రమణ్యం అక్కడకు చేరుకున్నారు. మృతురాలి కుటుంబీకులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. సమగ్రంగా దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు నిందితుడు జస్వంత్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

చోరీకి గురైన లారీ అప్పగింత


రేణిగుంట : చోరీకి గురైన లారీ ఆచూకీని పోలీసులు అతి తక్కువ సమయంలోనే కనిపెట్టి యజమానికి అప్పగించారు. బుధవారం ఈ ఘటన శ్రీకాళహస్తి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ అజయ్‌కుమార్ కథనం మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన షేక్ మహ్మద్ రఫీ మంగళవారం రాత్రి మండలంలోని రాచగున్నేరి పారిశ్రామిక వాడలో ఉన్న ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ (శ్రీకాళహస్తి పైప్స్)కు తన సొంత లారీలో బొగ్గు తీసుకొచ్చాడు. అన్‌లోడ్ చేసిన లారీని రోడ్డుపక్కన నిలిపి పక్కనే ఉన్న హోటల్‌లో భోజనం చేసేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి లారీ కనిపించలేదు. వెంటనే రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సారథ్యంలో సిబ్బంది అప్రమత్తమయ్యారు. ముచ్చివోలు మార్గంలో లారీ వెళ్లినట్లు గుర్తించి గాలింపు ముమ్మరంగా చేయడంతో దుండుగులు దొమ్మరపాళెం సమీపంలో లారీని వదిలి పారిపోయారు. లారీని స్వాధీనం చేసుకున్న పోలీసులు బుధవారం యజమానికి అప్పగించారు.

గంజాయి విక్రేత అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

తిరుపతి క్రైమ్ : నగరంలోని కొర్లగుంట సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి ఒకటిన్నర కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ సీఐ నాగరాజు రెడ్డి కథనం మేరకు.. స్థానిక డీబీఆర్ హాస్పిటల్ సమీపంలో గంజాయి విక్రయంపై సమాచారం అందడంతో దాడి చేయగా సాయిచందు అనే వ్యక్తి పట్టుబడినట్లు వెల్లడించారు. విశాఖపట్నం నుంచి నిందితుడు గంజాయి తీసుకువచ్చి తిరుపతిలో విక్రయిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ కేసుకు సంబంధించి మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, అతడిని త్వరలోనే అరెస్ట్ చేయనున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


జనార్దన్ (ఫైల్)

పెళ్లకూరు : నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిపై తాళ్వాయిపాడు గ్రామం వద్ద బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. శిరసనంబేడు దళితవాడకు చెందిన మల్లెపల్లి జనార్దన్ (52) రోడ్డు దాటుతుండగా టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీకొంది. దీంతో జనార్దన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఐఈఓగా స్వర్ణలత


స్వర్ణలత

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారిగా ఎ.స్వర్ణలత బుధవారం తిరుపతిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. నాగలాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఈమెను డీఐఈఓగా అదనపు బాధ్యతలను ఇంటర్ బోర్డు అప్పగించింది. ఇదివరకు డీఐఈఓగా విధులు నిర్వహించిన విశ్వనాథ నాయక్ చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పూర్తి బాధ్యతలు తీసుకున్నారు.

కట్టడాల పరిశీలనకు కేంద్ర పురావస్తుశాఖ

తిరుమల : అలిపిరి వద్ద పాదాల మండపం, తిరుమల పుష్కరిణి వద్ద ఆహ్నిక మండపం పరిశీలనకు కేంద్ర పురావస్తుశాఖ రానుంది. ఈ కట్టడాలను పరిశీలించి పునర్నిర్మాణానికి అవసరమైన సలహాలు అందించాలని 3 నెలల క్రితం టీటీడీ లేఖ రాసిన నేపథ్యంలో పురావస్తుశాఖ అధికారులు స్పందించారు. టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి విన్నపం మేరకు కేంద్ర సాంస్కృతిక శాఖ అడిషినల్ సెక్రటరీ రంజన్ చోప్రా ప్రత్యేక చొరవ తీసుకుని పురావస్తుశాఖ అధికారులను పరిశీలనకు వచ్చేలా చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఈ నెల 17, 18 తేదీల్లో పురావస్తుశాఖ ద్వారా ఏర్పాటైన కమిటీ ఆయా మండపాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక అందించనుంది.

సముద్రస్నానానికి వెళ్లి భక్తుడి మృతి


- మహాబలిపురం వద్ద ఘటన


భర్త మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య రాజేశ్వరి


రామ్‌ప్రసాద్ (ఫైల్)

వరదయ్యపాళెం : ఓంశక్తి మాల ధరించి అమ్మవారి దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో సముద్ర స్నానం చేయబోయి ఓ భక్తుడు మృతి చెందిన ఘటన తమిళనాడులోని మహాబలిపురం వద్ద బుధవారం జరిగింది. వివరాలు.. వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ పంచాయతీ పద్మావతీపురం గ్రామానికి చెందిన ధార రామ్‌ప్రసాద్ (ఆటో రాము) ఆటో నడుపుకుంటూ, స్థానిక బస్టాండ్ వద్ద కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇటీవల గ్రామంలో సుమారు 50 మంది ఓంశక్తి మాల ధరించారు. వారిలో రామ్‌ప్రసాద్, అతడి భార్య రాజేశ్వరి ఉన్నారు. ఈ క్రమంలో మంగళవారం అమ్మవారి దర్శనార్థం మేల్‌మరువత్తూరుకు రెండు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. తిరిగి వస్తూ మహాబలిపురం వద్ద సముద్రస్నానానికి ఆగారు. భార్యతో కలిసి సముద్రంలో దిగిన రామ్‌ప్రసాద్ అలల ఉధృతికి లోపలకు కొట్టుకుపోయాడు. కాసేపటికి మృతదేహం ఒడ్డుకు చేరింది. భర్త కళ్లెదుటే కన్నుమూయడంతో భార్య రాజేశ్వరి కన్నీరుమున్నీరైంది. సహచర భక్తుడు అనంత లోకాలకు వెళ్లిపోవడంతో గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. మహాబలిపురం పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెంగల్పట్టు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలిసి పద్మావతిపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పకడ్బందీగా 'ఆపరేషన్ స్వేచ్ఛ'


ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు


విద్యార్థుల మానవహారం

తిరుపతి క్రైమ్ : బాల కార్మిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు పోలీస్, సీఐడీ చేపట్టిన ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని దిశ డీఎస్పీ కాటమరాజు స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి శ్రీపద్మావతి ఫార్మసీ కాలేజీ నుంచి తిరుచానూరు పూడి కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. డీఎస్పీ మాట్లాడుతూ ఆపరేషన్ స్వేచ్ఛ కింద జిల్లాలోని పలు చోట్ల తనిఖీలు నిర్వహించి 8మంది బాల కార్మికులకు విముక్తి కల్పించామన్నారు. వారిని సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చినట్లు తెలిపారు. రాజ్యాంగ హక్కుల ప్రకారం వెట్టిచాకిరీ, బానిసత్వం, మనుషుల క్రయ విక్రయాలు చట్టవ్యతిరేకమని వెల్లడించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కృష్ణారెడ్డి, ఎస్ఐ శివాజీ పాల్గొన్నారు.